

# అంజన్న భక్తురాలికి.. మంగళవారమే బెయిల్

### ఎమ్మెల్సీ కవితకు కొండగట్టు ఆంజనేయ స్వామి అంటే ఎంతో ప్రీతి

### నమ్ముకున్న దేవుడు ఎట్టకేలకు సంజీవని ఇచ్చాడు..

### బెయిల్‌పై విడుదల కానున్న కవిత

### బీఆర్ఎస్ శ్రేణుల్లో సర్వత్రా హర్షం తెలంగాణ వ్యాప్తంగా సంబురాలు

తెలంగాణ క్యాపిటల్
మంగళవారం
27.08.2024

(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ బ్యూరో)

కేసీఆర్ తనయ.. ఎమ్మెల్సీ కవితకు ముందు నుంచి కొండగట్టు అంజన్న అంటే ఎంతో ప్రీతి. ప్రజల్లో ఉన్నప్పుడు ఆమె నిత్యం ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చి వెళ్తుండేవారు. మద్యం కేసులో 165 రోజులుగా జైలులో ఉన్న ఆమెకు ఎట్టకేలకు మంగళవారమే బెయిల్ లభించడంతో.. నమ్ముకున్న దేవుడు దారి చూపించాడని సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. నాడు లక్ష్మణుడి కోసం ఆంజనేయుడు సంజీవనని అందించినట్లుగా నేడు.. కవితకు బెయిల్ రూపంలో మంగళవారం రోజే ఆ అంజన్ననే అందించారని బీఆర్ఎస్ శ్రేణులు వాపోతున్నారు. కవిత అంజన్నపై పెట్టుకున్న నమ్మకం మరోసారి రుజువైందని చెప్పుకొస్తున్నారు.

## కవితకు బెయిల్

మద్యం కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు ఎట్టకేలకు బెయిల్ మంజూరు చేసింది. ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. కవిత తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, ఈడీ తరపున ఏఎస్‌జీ వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం కవితకు బెయిల్ మంజూరు చేసింది. ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ ఇస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. బెయిల్ మంజూరుకు సుప్రీంకోర్టు మూడు ప్రధానమైన కారణాలు చెప్పింది. సీబీఐ తుది ఛార్జ్‌షీట్ దాఖలు చేసిందని.. ఈడీ కూడా దర్యాప్తు పూర్తిచేసిందని పేర్కొంది. నిందితురాలు జైలులో ఉండాల్సిన అవసరం లేదంది. మహిళగా కూడా పరిగణించాల్సి ఉందని అభిప్రాయపడింది. అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. బెయిల్ కోసం రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని సూచించింది. సాక్షులను ప్రభావితం చేయకూడదని ఆదేశించింది. దీంతో దాదాపు 165 రోజుల తర్వాత కవిత జైలు నుంచి బయటకు రానున్నారు.



## ఇదీ నేపథ్యం

ఢిల్లీ మద్యం విధానంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ 2022 ఆగస్టులో సీబీఐ కేసు నమోదు చేసింది. ఇదే కేసులో హైదరాబాద్‌కు చెందిన మద్యం వ్యాపారి అరుణ్ రామచంద్రపిళ్లై వాంగ్మూలాన్ని సేకరించిన అనంతరం కవితకు నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఢిల్లీ మద్యం టెండర్ల వ్యవహారంలో సౌత్ లాబీ తరపున రూ.కోట్లు చేతులు మారాయనే కోణంలో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. అరుణ్ రామచంద్రపిళ్లై రిమాండ్ నివేదికలో అతడిని కవిత బినామీగా పేర్కొంది. ఈ సౌత్ గ్రూప్ ద్వారా రూ.100కోట్ల ముడుపులు ఆప్‌కు హవాలా మార్గంలో అందాయని అభియోగం మోపింది. గతేడాది మార్చిలో కవితకు నోటీస్ జారీ చేసి విచారించింది. ఆ తర్వాత మరోమారు కూడా సమన్లు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి 25న ఈడీ అధికారులు హైదరాబాద్‌లో అరెస్టు చేసి మార్చి 26న జ్యాడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత ఏప్రిల్ 11న సీబీఐ కూడా అదుపులోకి తీసుకుంది. సౌత్ గ్రూప్ ద్వారా రూ.100 కోట్ల స్కాంకు పాల్పడినట్లు అభియోగాలు మోపింది. ఈ మేరకు రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా.. న్యాయస్థానం ఆమెకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో కవిత 5 నెలలకు పైగా తీహార్ జైలులోనే ఉన్నారు. పలుమార్లు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ రోజు ఎట్టకేలకు బెయిల్ మంజూరు కావడంతో మళ్లీ ఆమె ప్రజాక్షేత్రంలోకి అడుగు పెట్టనున్నారు.

## సుప్రీం కోర్టులో వాదనలు ఇలా..

కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఈ ఏడాది మార్చి 15న అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అరెస్ట్ చేసినట్లు ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్ అప్పట్లో ప్రకటించారు. అరెస్ట్ వారెంట్‌తో ఆమె ఇంటికి వెళ్లిన ఈడీ అధికారులు తొలుత సోదాలు నిర్వహించి, మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం విచారించి కవిత వాంగ్మూలం నమోదు చేశారు. ఆమె నుంచి ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కవితను తిహాడ్ జైలుకు తరలించారు.



